# నేహాల



సాయి బ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 3

శరత్కాల పున్నమి చంద్రుడికి దారిచూపుతూ చీకటి గుహలోకి ప్రవేశించాడు భానుడు.

పున్నమి కిరణాల వెలుగులో రెల్లుగడ్డి తళతళా మెరుస్తోంది.

చంద్రుడి చల్లదనానికి కొలనులో కలువులు మెల్లగా కళ్ళు విప్పాయి.

ఆశ్వీజ పౌర్ణమి సందర్భంగా అశ్వత్థనారాయణ ఆలయంలో సాయంత్రపు పూజ మొదలయ్యింది. పూలతో అలంకరించిన అశ్వత్థ నారాయణున్ని చూడడానికి ముద్గల్ గ్రామ వాసులందరూ వచ్చారు.

ఊహ తెలిసినప్పటినుండీ ఏనాడూ పౌర్ణమి పూజని చూడకుండా లేదు నేహల. క్రమం తప్పకుండా కుటుంబంతో కలసి వస్తుంది. ఈ సారి తండ్రి పక్కగ్రామంలో పనుందని వెళ్ళాడు. తల్లి నడిచే ఓపికలేక రాలేనంది. సాధారణంగా నేహల స్నేహితురాళ్ళందరితోనూ కలిసొస్తుంది. ఈసారి మాత్రం ఒక్కతే వచ్చింది. స్నేహితురాళ్ళందరూ గురువుగారితో కలిసి విజయనగరం వెళ్ళారు.

తరచు రేవన్నతో కలసి ఆలయానికొచ్చేది. ఈసారి అతనూ లేడు. విజయదశమి ఉత్సవాలు ముగించుకొని పౌర్ణమికల్లా వచ్చేస్తానని మాటిచ్చాడు. ఉదయం నుండీ రేవన్న కోసం ఎదురు చూస్తూనే ఉంది. వీధిలో ఎడ్లబండి చప్పుడయితే చాలు రేవన్నేమోనని పరిగెత్తుకొచ్చేది. అందరి మధ్యా కూర్చుని పూజలో ఉన్నా ఆమె కళ్ళు మాత్రం రేవన్న కోసమే వెతుకుతున్నాయి. అతను ఎందుకు రాలేదోనని పరిపరి విధాల ఆలోచిస్తోంది.

అతనే కాదు, తన స్నేహితురాళ్ళూ వచ్చిన జాడా లేదు. బహుశా ఇంకా దారిలో ఉన్నారేమో అనుకుంది. విజయనగరం నుండి రావడానికి మూడు రోజులు పడుతుందని తను వింది. అందరూ బండ్లు కట్టించుకొని వెళ్ళారు. వెళ్ళి రెండు వారాలయ్యింది. విజయదశమి ఉత్సవాలయ్యే వరకూ ఉండనని చెప్పారు గురువుగారు. పౌర్ణమి వెళ్ళిన చవితికి యన తల్లి బ్రీకం వుంది. ఎట్టి పరిస్థితిల్లోనూ వచ్చేస్తారని తెలుసు. రేవన్న కూడా తను పౌర్ణమికల్లా వచ్చేస్తానని చెప్పాడు.

ఆచారి పూజ ముగించి, చివరగా మంత్ర పుష్పం చదువుతున్నాడు. ఎప్పుడు హారతి ఇస్తారా అని ఎదురుచూస్తోంది నేహల.

ప్రతీ పున్నమికీ తనూ, రేవన్న ఆలయం వెనుకనున్న కొలను గట్లమీద కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. ఒక్కోసారి స్నేహితురాళ్ళుండేవారు. ఎవరొచ్చినా లేకపోయినా తనూ, రేవన్నా ఖచ్చితంగా వచ్చేవారు.

రేవన్నెందుకు రాలేదోనని కలవర పడుతోంది. ప్రయాణం మధ్యలో గిపోయారా? లేకా విజయనగర ఉత్సవాలన్నీ ముగించుకొని వస్తున్నారా? లేక రేవన్న ఉదయమే వచ్చి, తనని ఆట పట్టించడంకోసం కలవకుండా ఈ గుంపులో దాక్కున్నాడా? తనకెటువంటి సమాచారామూ లేదు.

ఆమె ఒకటికి రెండు సార్లు చుట్టూ కలయ చూసింది. ఎక్కడా వచ్చిన జాడ లేదు. ఒకవేళ కొలను దగ్గరున్నాడా? పూజ మధ్యలో లేచి వెళ్ళడానికి సాహసించలేదు. మంత్రపుష్పం అయ్యింది. ఆచారి హారితిచాడు. అందరూ కళ్ళకద్దుకున్నారు. ఒక్కొక్కరికీ

పూలూ, అక్షింతలూ. ప్రసాదమూ ఇస్తున్నాడు. తన వంతెప్పుడొస్తుందా అక్కడనుండి ఎప్పుడు బయటపడతానా అని తొందరపడుతోంది నేహల.

ప్రసాదం తీసుకొని, రేవన్న క్షేమగా తిరిగి వచ్చేలా చెయ్యమని అశ్వత్థనారాయణున్ని కోరుకొని ఒక్క

ఉదుటన కొలను వైపు దారి తీసింది.

జనం మధ్యలో ఎక్కడైనా రెవన్న కనిపిస్తాడేమోనని చూసింది. స్నేహితురాళ్ళు కానీ, రేవన్న కానీ ఎవరూ కనిపించలేదు. పరుగున కొలను వైపు వెళ్ళింది. అందరూ ఎప్పుడూ కూర్చునే ప్రదేశం కేసి చూసింది. ఎవరూ లేరక్కడ. ఇంకా వచ్చుండరేమో ననుకుని వెను తిరుగుతుండగా కొలను మెట్ల దగ్గర ఓ ఆకారం కనిపించింది. ముఖం కనిపించలేదు. వెనక్కి తిరిగున్నాడా వ్యక్తి. నెత్తిన తలపాగ వుంది. కాబట్టి అక్కడున్నది పురుషుడేనన్న నిర్ధారణ కొచ్చింది. రేవన్నే తనని ఆటపట్టించాలని అలా నటిస్తూ ఉండచ్చు. అటువైపుగా రెండడుగులు వేసింది. వెన్నెల వెలుతుర్లో  ఆకారం స్పష్టంగా కనిపించింది.  తలపాగాని గుర్తు పట్టింది. అది ఖచ్చితంగా రేవన్నది.

తననాట పట్టిస్తే తనూ తక్కువ చదివిందా? కాలి పట్టీలు చప్పుడు కాకుండా మెల్లగా అడుగులో అడుగువేసుంటూ  వ్యక్తిని సమీపించింది. చప్పుడు చేయకుండా రెండు చేతుల్తో వెనుకనుండి  ఆ వ్యక్తి కళ్ళు మూసింది.

ఆ వ్యక్తి ఒక్కసారి విదిలించుకోబోయాడు. బలంగా కళ్ళు మూసింది నేహల.

"పేరు చెప్పి, క్షమాపణ కోరితే కానీ వదిలేది లేదు." గట్టిగా చేతులతో  కళ్ళని బంధించింది. విడిపించుకుందామనుకునే ప్రయత్నంలో  ఆ వ్యక్తి తలపాగ క్రింద పడింది. తన చేతులతో నేహల చెయ్యిని విడిపించుకుంటూండగా  వ్యక్తి చేతులకేసి చూసి ఒక్క సారి ఆగిపోయింది.  ఆ వ్యక్తి చేతులకి ఆడవాళ్ళు ధరించే కంకణాలున్నాయి. ఒక్క సారి విదిలించుకొని వెనక్కి జరిగింది నేహల.

ఆ వ్యక్తి కళ్ళు నులుపుకుంటూ వెనక్కి తిరిగి తలెత్తి చూసింది. స్నేహితురాలు ప్రభని గుర్తించిది నేహల.

ఆశ్చర్యపోయింది.

"ను...వ్వా? నేనింకా...రే..వ..న్న..అనుకున్నా..." మాటలు తడబడ్డాయి.

"అవును నేనే? ఏం రేవన్ననుకొని ఖంగు తిన్నావా?" నవ్వుతూ అంది ప్రభ.

"అవును...మరి ఆ తలపాగ..రేవన్నది. నీకెలా వచ్చింది?" అనుమానంగా అడిగింది నేహల.

అది విని ప్రభ విరగబడి నవ్వింది.

"ఓ! అదా, నువ్వు పౌర్ణమినాడు తనకోసం ఎదురుచూస్తావనీ, నిన్ను కాస్త ఏడిపించడానికి రేవన్న ఆడిన నాటకం ఇది. నీకనుమానం రాకుండా ఉండడానికి తలపాగ ఇచ్చి పంపాడు.."

నేహల ఈ మాటలకి ఉడుక్కుంది. రేవన్న మీద పీకల వరకూ కోపమొచ్చింది.

"నాకు తెలుసు - ఇలాంటి తింగరి ఆలోచన్లు అతనికే వస్తాయి. ఎక్కడున్నాడో చెప్పు? చెవులిగ్గదీసి మరీ అడుగుతాను..."

"ఎక్కడున్నాడో చెప్పాలా? అయితే పద - పెట్టె సర్దుకో విజయనగరం  వెళ్ళొద్దాం."  వెటకారంగా అంది ప్రభ.

"ఆ! రేవన్న రాలేదా? ఇంకా అక్కడే.." నమ్మలేక పోయింది.

"అవును. గురువుగారూ, రేవన్న రావడానికింకా మూడు రోజులు పడుతుంది. అంతవరకూ ఉండడమెందుకనీ మిగతా అందరం ఇవాళ మధ్యాహ్నమే వచ్చాం. నిన్ను కలిస్తే ఇలా ఏడిపించడం కుదర్దని ముద్గల్లు రాగనే నిన్ను కలవద్దని అందర్నీ హెచ్చరించీ మరీ పంపాడు..తెలిసిందా?"

నేహలకి రేవన్నమీద కోపం పెరిగిపోయింది.

"రానీ చెప్తాను. తనొక్కడేనా ఆట పట్టించేది? నేనూ చెయ్యగలను.."

పళ్ళూ పటపటా కొరుక్కుంది నేహల. ఒక పక్క రాలేదన్న కోపం, మరో పక్క తనని ఆటపట్టించాడన్న నాటకం, ఇవన్నీ మరింత ఉడుక్కునేలా చేసాయి. కోపంతో విసురుగా కొలను మెట్లమీద కూర్చుండిపోయింది.

"కోప్పడకు నేహలా? ఇవన్నీ ప్రణయకలహంలో భాగమే! పాపం తనూ మాతో రావడానికి శత విధాలా ప్రయత్నించాడు. గురువుగారు తోడుండి తీరాలని బలవంత పెడితే తప్పలేదు. నువ్వు నమ్మవు. ఈ రెండు వారాలూ నీ పేరు తలవని క్షణం లేదు. నువ్వు కూడా వచ్చుంటే ఎంత సంబరపడిపోయేవాడో..." అనునయిస్తూ అంది ప్రభ.

"నేన్నమ్మను. ఇలా నాతో చెప్పమని నీకు చెప్పాడా?"

"పోనీ, నన్ను నమ్మద్దు. కనీసం ఇది చూసయినా నమ్ముతావా...?" తన కండువాలో చుట్టిన మూట తీస్తూ అంది ప్రభ. ఏమిటోనని ఆత్రంగా చూసింది నేహల.

ఒక నగిషీ చెక్కిన చందనపు కర్రకి ఎర్రటి గుడ్డ చుట్టబడి కనిపించింది. ఒక్క ఉదుటున లాక్కుంది నేహల.

గబగబా విప్పి చూసింది. ఎర్రటి వస్త్రంపై తెల్లటి అక్షరాలు వెన్నెల కాంతిలో మరింతగా మెరుస్తూ కనిపించాయి. ఏమిటాని పైకి చదవడం మొదలు పెట్టింది.

"అలరుల గంధము శీతల వెన్నెల.."

చదువుతున్నంత సేపూ ఆమె కళ్ళలో సంతోషం వెలిగింది.

చదవడం పూర్తయ్యాక, ఆనందంతో "ఏమిటిది?" అని అడిగింది.

"అదా! నీకు ప్రేమ లేఖ..అర్థం కాలేదా?"

తెలీదన్నట్లు తలూపింది నేహల.

"రేవన్న నీ కోసం పంపిన కానుక. నీ కిష్టమయిన 'సావిరహే తవ దీనా? ' అనే జయదేవాష్టపది. నీకోసం తనే స్వయంగా తెలుగులో రాసాడు. ఇప్పటికయినా నమ్ముతావా?"

ప్రభ మాటలు వింటూంటే నేహల కళ్ళల్లో ఆనందం వెల్లి విరిసింది. ఒక్కసారి రేవన్న పేరు తలవగానే ఒళ్ళు జలదరించింది. పదే పదే ఆ అష్టపదిని చదవడం మొదలు పెట్టింది.

"నేహలా! నువ్వు చాలా అదృష్టవతురాలివే! రేవన్న నిన్నెంతగా ప్రేమిస్తాడో నీకు తెలీదు. నువ్వు విజయదశమి వేడుకలకి రాలేదని ఎంత కొట్టిమిట్లాడాడో తెలుసా? మేం నృత్య ప్రదర్శన చేస్తున్నంత సేపూ అతని ధ్యాసంతా నీ మీదే! నువ్వు కూడా విజయనగరం వచ్చుండాల్సింది. ఎంత వైభవమో? కళ్ళు చెదిరే భవనాలూ, రాజ మందిరాలూ చూసి తీరాలి. తుంగభద్రా నదీ తీరంలో విరూపాక్షాలయం ఎంత పెద్దదో తెలుసా? అక్కడే రేవన్న నీకోసం ఈ పత్రం రాయించాడు. అవన్నీ చూస్తుంటే వూరొదిలి రాబుద్ధి కాలేదంటే నమ్ము..." విజయనగరం గురించి ఎంతో గొప్పగా చెప్పింది ప్రభ.

"నిజమా? నాకూ రావాలనే అనిపించింది. కానీ ఎందుకో రాజాస్థానంలో ప్రదర్శనంటే నాకు నచ్చలేదు.. అందుకే.."

"నువ్వొట్టి మూర్ఖురాలివి. రాజమందిరంలో నృత్యం చేస్తే ఏమయ్యిందిట? ఏం ఇక్కడ గుళ్ళో ఎప్పుడూ చెయ్యలేదా?"

నేహలేమీ మాట్లాడ లేదు. తలదించుకునే వుంది. "నువ్వొచ్చుంటే ఎంత బావుండేదో తెలుసా? గురువుగారు కూడా చాలా సార్లన్నారు. నీ ఎదురుకుండా అనకూడదు కానీ, నేహలా - నీ నృత్యం ముందు మాది సూర్యుడి ముందు దివిటీ. నీకున్న ప్రతిభ అందరికీ తెలియాలి. అంతంత మాత్రంగా చేసిన మాకే ఎన్నో కానుకలిచ్చి పంపారు. నీ నృత్యం చూసుంటే కళ్ళు తిరిగి క్రింద పడిపోయుండేవారు. ఎన్ని చెప్పు...నువ్వు రాకపోవడం మాత్రం బాగో లేదు.."

ప్రభా! నేను నృత్యం నేర్చుకునేది నాకోసం - నా ఆనందంకోసం. అంతేకానీ నా కళతో పదిమందినీ అలరిద్దామని కాదు. ప్రజల్ని ఆనందపరిచేందుకు వేరే వాళ్ళున్నారు. చూసేవాళ్ళు నా నృత్యంలో అందాలు కంటే నా శరీరపు యవ్వనాన్నే వీక్షిస్తారు. అది నాకిష్టం లేదు. ఆడదంటే ఓ శృంగార వినోదం కాదనే నా అభిప్రాయం. నన్ను నేను చంపుకొని పదిమంది ముందూ నర్తించలేను. ముఖ్యంగా రాజాస్థానంలో! గురువుగారు ఎన్ని విధాల చెప్పినా కాదన్న కారణం ఇదే! మా అమ్మా, నాన్నా కూడా వెళ్ళమనే ప్రోత్సహించినా, ఇందుకే వెళ్ళ లేదు. రేవన్న ఎన్నో సార్లు ప్రాధేయపడ్డాడు. అభిమానాన్ని చంపుకోలేను ప్రభా! విజయనగరం మరో సారి వెళ్ళచ్చు. మీ అందరి సాంగత్యమొక్కటే ఈ రెండు వారాలూ నేను కోల్పోయానని భావిస్తాను.''

నేహల ఆవేశం వెనుక అభిమానమూ, వ్యక్తిత్వమూ చూసి ఒక్కసారి స్నేహితురాలి భుజం తట్టింది ప్రభ.

''నేహలా! నువ్వు అందరిలాగా ఆలోచించవు. రేవన్నలాంటి వ్యక్తి నీ ప్రియుడయ్యాడని మేమందరం అసూయ పడతాం. కానీ నీలాంటి స్త్రీ రేవన్నకి ప్రియురాలు కావడం నిజంగా అతని అదృష్టమే!''

రేవన్న పంపిన లేఖాపత్రాన్ని మరో సారి తడివి చూసుకొని గుండెలకి హత్తుకుంది నేహల.

విజయనగర విశేషాలు చాలా సేపు ముచ్చటించుకున్నారిద్దరూ.

''వచ్చి చాలా సేపయ్యింది. మా నాన్నీపాటికి పక్కూరునుండి వచ్చే వుంటాడు. అమ్మ కూడా ఎదురు చూస్తూ ఉంటుంది. వెళదామా?'' నేహల అక్కడనుండి లేస్తూ అంది.

పూజారి అప్పుడే ఆలయ ద్వారాలు మూస్తున్నాడు. ప్రభా, నేహలా ఇంటి ముఖం పట్టారు.

ఆ దారి పొడవునా నేహల మనసులో రేవన్నే మెదులుతున్నాడు.

ఆమె సంతోషాన్ని ప్రకృతికి పంచుతూ, ఆకాశంలో చంద్రుడు వెన్నెల గంధాన్ని వెదజల్లుతున్నాడు.

ఇంట్లో అడుగు పెడుతూండగానే నేహల ముఖంలో సంతోషాన్ని గమనించాడు తండ్రి హరేంద్ర.

తనలో తను నవ్వుకుంటూ లోపలికి వస్తున్న కూతుర్ని చూస్తూ - ''ఏంటి విశేషం నేహలా? అంత ఆనందంగా వున్నావు?''

తండ్రి చూడగానే నవ్వుతూ అతన్ని సమీపించి - ''ఏమీ లేదు. విజయనగరం నుండి ప్రభా వాళ్ళూ వచ్చారు. నా స్నేహితులు నీకీ కానుక తెచ్చారు.'' అంటూ చేతిలో ఉన్న చందన లేఖా పత్రాన్ని చూపించింది.

అతను విప్పి చూసాడు.

''ఈ చందనానికి నగిషీ బావుంది. ఇందులో ఏదో రాసినట్లున్నారు. ఏమిటిది?'' కళ్ళు పెద్దవి చేస్తూ అన్నాడు.

''ఓ అదా! నేను అస్తమానూ నృత్యం చేస్తానూ, జయదేవాష్టపది, విన్నావు కదా? అది తెలుగులో రేవన్న రాసాడు.''

''చదువూ, సంధ్యా అబ్బలేదు కదమ్మా? తెలుగని గుర్తించాను కానీ సరిగ్గా చదవలేను. కన్నడమయితే కాస్తో, కూస్తో కుస్తీ పట్టగలను. అయినా వ్యవసాయం చేసుకునే నాబోటోళ్ళకి ఈ చదువెందుకమ్మా? ''

''అలా అనకు నాన్నా! అవసరముంటేనే నేర్చుకుంటావా?'' ఎదురు ప్రశ్నించింది.

''నేను చదివినా చదవకపోయినా, నా బంగారు తల్లి చదువుకుంటే చాలు. అందుకే నీకు మా బదులుగా సంస్కృతమూ, సంగీతం అన్నీ నేర్పిస్తున్నాను కదా? వేదరాయ శర్మ గారిలాంటి పెద్దోళ్ళ దగ్గర నిన్నెందుకు చేర్పించాననుకున్నావు?''

ఇంతలో నేహల తల్లి జయమ్మ లోపల్నుండి వచ్చింది.

''ఏంటి తండ్రీ కూతుళ్ళు వాదనలో దిగారా? కాళ్ళు కడుక్కో నేహలా, భోజనం చేద్దాం?''

తల్లికి రేవన్న పంపిన కానుక చూపించింది.

భోజనాలు ముగించి త్వరగా పక్క మీద వాలింది నేహల. నిద్ర పోదామన్నా రేవన్నే గుర్తుకొస్తున్నాడు.

అతను పంపిన లేఖని ఎన్ని సార్లు చదివిందో లెక్క లేదు.

"అలరుల గంధము.." రాత్రంతా తనలో తను పాడుకుంటూనే వుంది.

ప్రియుడు పంపిన సందేశాన్ని గాఢంగా గుండెలకి హత్తుకుంది నేహల.

ప్రేమ గంధపు వాసనలతో మలయ మారుతం సుతారంగా చంద్రుణ్ణి తాకింది.

0000000000000000000000000

గుల్బర్గా కోటలో ఫిరోజ్ షా తన అంతరంగికులతో సమావేశమయ్యాడు. దేవరాయుల రాయచూరు దాటకుండానే తమ సేనల్ని వెనక్కి తిప్పి కొట్టడం జీర్ణించుకోలేక పోతున్నాడు. ప్రాణ నష్టం ఎక్కువగా జరగకపోయినా ధన నష్టం జరిగింది. సైన్యాన్ని తరలించడమంటే అంత తేలికయిన వ్యవహారం కాదని తెలుసు. అనవసరంగా దేవరాయల్ని ప్రేరేపించామాన్న ఆలోచనలో పడ్డాడు ఫిరోజ్ణ షా. అతని తమ్ముడు అహ్మద్ఖాన్ అలా భావించడం లేదు. అతనికి ఎలాగయినా దేవరాయల్ని దెబ్బ కొట్టాలి. విజయనగరాన్ని స్వాధీన పరచుకుంటే అన్నగారికీ గుల్బర్గా ఇచ్చేసి, తను విజయనగరం పాలించుకోవచ్చన్నది అతని మనసులో ఉన్న దురాలోచన. అందుకే అతను అతి తెలివిగా పావులు కదుపుతున్నాడు.

సభికులందర్నీ వుద్దేశించి ఫిరోజ్షా ప్రసంగించాడు. యుద్ధం పై ఓ చిన్న విచారణ నిర్వహించాడు. పదీమందితో మంచీ చెడూ చర్చిండు. యుద్ధానికి వెళ్ళకుండా ఉండాల్సిందన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ఇది అహ్మద్ఖాన్కి మింగుడు పడలేదు.

"సుల్తాన్ ఫిరోజ్ షా! మీ మాటలు నేను విశ్వసిస్తాను. యుద్ధమనేది ఎవరికీ సుఖాన్నివ్వదు. కాదనను. ఈ రోజు మనం మొదలు పెట్టకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు దేవరాయలు మనపై దండెత్తకుండా ఉండడు. వారికా ఆస్కారమివ్వకుండా మన జోలికి రావద్దన్న హెచ్చరిక గానే మనం రాయచూరు యుద్ధానికి ఉపక్రమించాం. యుద్ధంలో గెలిచామా, ఓడామా అన్నది వేరే విషయం. కానీ దేవరాయలు మనవైపు రానీయకుండా ఒక హెచ్చరిక చేసి మనం విజయం సాధించామనే అనుకుంటున్నాను."

అహ్మద్ ఖాన్ మాటలకి సైన్యాధికారీ, అతని దండనాయకులూ అందరూ మోదముద్ర వేసారు.

జరిగిందేదో జరిగింది, ముందు ముందు ఇలాంటివి రాకుండా ఉండేలా ఏం చెయ్యాలీ అన్నది ఫిరోజ్షా ఆలోచన.

"యుద్ధం పేరు చెప్పి బాగానే ఖర్చుపెట్టాం. ధనాగారం పై ఈ దెబ్బ బాగానే పడింది. అది నింపడానికి ప్రజలపై కొత్తగా పన్నులు విధించడానికి మనస్కరించడం లేదు. గిసు దరాజ్ కూడా ఈ యుద్ధంపై కాస్త కోపంగా ఉన్నట్లు తోస్తోంది. ఇలాంటప్పుడు పన్నులంటే - ఆయన చేత కోరి గ్రహం తెప్పించుకున్నట్లవుతుంది. ఏం చేయ్యాలో పాలుపోడం లేదు.."

అహ్మద్ ఖాన్ అన్నగారి మాటలు విన్నాడు. గిసుదరాజ్ అంటే సుల్తాన్ కి ఎనలేని గౌరవమని తెలుసు. ఆయన్ని కాదని వాళ్ళెవరూ బ్రతికి బట్టలేరన్న విషయమూ తెలుసు.

"సుల్తాన్! మీ బాధ అర్థమయ్యింది. మీరన్నది నిజమే! ప్రస్తుతం పన్నులు విధిస్తే ఎవరూ మెచ్చరు. కానీ మన సైన్యాన్నీ పెంపొందించుకోవాలి. మరలా మనపై దేవరాయలు దండేత్త కుండా చూసుకోవాలి. దీనికి ప్రజల సహకారం కావాలి. నాకో - ఆలోచనుంది.." సంశయిస్తూ చెప్పడం ఆపేసాడు.

"ఏమిటది? చెప్పండి.."

"మనం ఈ గుల్బర్గా కోటనుండి నివాసం మార్చాలి. వీలయితే మరో స్థావరం చూసుకోవాలి. కావాలంటే రాయచూరు దగ్గర్లో ఒక కొత్త కోటని కట్టుకోవాలి. ఆ విధంగా దేవరాయల చర్యల్ని మనం అరికట్టవచ్చు. కొత్త కోట నిర్మాణానికి ప్రజల సహాయం కావాలని అడుగుదాం."

"ఇంకో కోటా? అసలే కోశాగారం నిండుకుంటోందని నేను భయపడుతూంటే - మరో రాజ మహలా?"

"సుల్తాన్! మనం మన కోసం కోట కడుతున్నట్లుగా ప్రజలకి చెప్పం. గుల్బర్గాలో నీటి కరువు మీకు తెలియంది కాదు. అది తీర్చడానికి భీమ నది నుండి నీరు ఇటువైపుగా మళ్ళిస్తామని ప్రజలకి చెబుదాం. బీమ నదినుండి కాలువలు తవ్వాలంటే ధనం కావాలి. నీటి కోసం అది ప్రజలిస్తారు. ధనంతో పర్యవేక్షణా స్థలం కావాలని చిన్న మందిరం అని ముందుగా చెబుదాం. ఎవరూ కాదనరు. చిన్న మందిరం బదులు అక్కడ కోట కట్టిద్దాం.."

"ఈ సలహా బాగానే ఉంది. కానీ గిసుదరాజ్..ఒప్పుకుంటారా?" అనుమానం వ్యక్తం చేసాడు ఫిరోజ్‌షా.

"ప్రజలకి వసతులంటే ఆయన తప్పకుండా సమర్ధిస్తారు. ఆయన మద్దత్తుంటే ప్రజలూ కాదనరు. నన్ను నమ్మండి.."

ఫిరోజ్‌షా లోచించాడు. అహ్మద్‌ఖాన్ చెప్పింది బాగానే తోచింది. మిగతా సభ్యులందరూ అహ్మద్‌ఖాన్ వైపే మాట్లాడారు.

"అలాగే - మీరు చెప్పినట్లుగానే చేద్దాం." ఫిరోజ్‌షా ఒప్పుకున్నాడు.

చివర్లో అహ్మద్‌ఖాన్ అందరికీ చిన్న హెచ్చరిక చేసాడు.

"ఇక్కడ జరిగినవి ఈ మందిరం దాటి బయటకి పోకూడదు. ఒకవేళెవరైనా నోరుజారితే శిక్ష తప్పదు. సుల్తాన్! మీరు గిసుదరాజ్‌ని కలిసి భీమ నదిని పాయలుగా తవ్వించే పథకం గురించి చెప్పండి. ఆయన కాదనరు. ఆ నది ఒడ్డున వేసవి విడిదికై ఒక మందిరం నిర్మిస్తున్నట్లుగా సెలవీయండి. మెల్లగా మనం గుల్బర్గా నుండి మన రాజధాన్ని కొత్తూరికి మారుద్దాం. పైకి ఒక మందిరమని చెప్పినా అక్కడ ఆధునిక సదుపాయాలతో ఢిల్లీ లో ఉన్న ఫతేపూర్ సిక్రీ లాంటి కోట కడదాం. నేను ఆ కోట నమూనాని తెప్పిస్తాను. "

తన ఆలోచన్ని చెప్పాడు అహ్మద్‌ఖాన్.

ఫిరోజ్‌షా అతి శ్రద్ధగా వినాడు. సరేనని ఒప్పుకున్నాడు.

" కొత్త కోటకి గిసు దరాజు పేరు పెడదామా? ఫిరోజ్ షా మనసులో మాటన్నాడు.

"కోట పేరేదయినా - ఊరి పేరు మాత్రం మన పేరు మీదుండాలి.."

"అంటే?" ఫిరోజ్‌షాకి అర్థం కాలేదు.

"కొత్త నగరం పేరు ఫిరోజాబాద్ అని పేరు పెడదాం. మీ పేరున చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఏమంటారు సుల్తాన్?"

ఫిరోజ్‌షాకి తన పేరుపెట్టాలన్న ప్రతిపాదన చాలా నందం కలిగించింది. తన పేరు మీదుగా ఒక కొత్త నగరమన్న ఆలోచన విని ఫిరోజ్‌షా పూలకించిపోయాడు.

తమ్ముణ్ణి అభినందించకుండా ఉండలేకపోయాడు.

పొగడ్తలకి తలవంచని వారెవరుంటారు? రాజయినా, బికారయినా పొగడ్తలకి బానిసలే కదా?

అహ్మద్‌ఖాన్‌కి ఇలాంటి చిన్న విషయాలు వెన్నతో పెట్టిన విద్య.

ఫిరోజా బాదు నిర్మాణానికి అంకురార్పణ జరిగిందని ఫిరోజ్‌షా ఆనందిస్తే, తన రాజకీయ భవిష్యత్తుకి మొదటి పునాది రాయి వేసి శంకుస్థాపన చేసుకున్నాడు అహ్మద్‌ఖాన్.

0000000000000000000000

రాచకార్యాలు ముగిసాకా వేదరాయ శర్మ స్వగ్రామం ముద్గల్ వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. రేవన్న రెండు రోజులూ అతి భారంగా గడిపాడు. ఎప్పుడు వెనక్కి తిరిగి వెళిపోదామాని ఎదురుచూస్తున్నాడు.

దేవరాయలు తిరుగు ప్రయాణానికి గుర్రపుబండ్లు సమకూర్చాడు. వారికి సాయంగా మరో కొంతమంది వేరే బండ్లలో బయల్దేరారు. ముందుగా వేదరాయశర్మకొక ప్రత్యేకంగా ఒక బండిని సమకూర్చాడు. అందులో తోకలిపి ఇద్దరేనని అనుకున్నాడు రేవన్న. విజయనగరం పొలిమేరలు దాటుతుండగా దారిలో ఒక చోట పాడు బండితోలే అతను. రేవన్న ఎందుకో అనుకున్నాడు. కొంతసేపటికి ఒక కొత్త వ్యక్తి బండెక్కాడు. వస్తూనే వేదరాయ శర్మకి నమస్కరించాడు.

రేవన్న అతన్ని ఇంతకుందెప్పుడూ ఎక్కడా చూడలేదు. ఎవరా అనుకున్నాడు. తలపాగా ధరించినతను ముఖాన్ని గుడ్డతో కప్పుకున్నాడు. కళ్ళు తప్ప ఇంకేమీ కనబడడం లేదు. బండెక్కాక ఒక మాటంటే ఒక్కటి మాట్లాడ లేదు. రాత్రి ఒక గ్రామంలో బస చేసారు. అందరూ పలకరించినా అతను మాత్రం బండి దిగలేదు. ఎవరితను? ఎందుకు తమతో వస్తున్నాడు? వివరం తెలీక రేవన్న సతమత మయ్యాడు. గురువునడిగే ధైర్యం లేదు.

ఆ మర్నాడు రాయచూరు సమీపిస్తూండగా అతను బండి దిగి వెళిపోతూ వేదరాయ శర్మకి నమస్కరించాడు. దారిపొడుగునా ఒక్క మాట మాట్లాడితే ఒట్టు.

"వేదరాయ శర్మగారూ, నన్ను కలవాలంటే రాయచూరులో ప్రముఖ వైద్యుడు సుబ్బయ్యకి కబురంపండి చాలు. నేనే మీరున్న చోటుకొస్తాను. మీకెప్పుడయినా పదిమంది ముందూ నేనెదురుపడితే పలకరించే ప్రయత్నం మాత్రం దయచేసి చెయ్యకండి.." ఈ మాటలంటూ అతను ముఖమ్మీద ముసుగు తీయ లేదు.

"నాకు తెలుసు నాయనా. నువ్వు పదే పదే చెప్పనవసరం లేదు. ఏ విషయమున్నా నా శిష్యుడు రేవన్నని పంపిస్తాను. ఇతన్ని చూసావు కదా?"

అతను అవున్నట్లుగా తలూపాడు.

"ఎవరండీ ఇతను? అతను నన్ను గుర్తుపట్టాడు. సరే. నేనూ అతన్ని చూడాలికదా? ముసుగుండగా గుర్తించడం కష్టం. కాబట్టి..." రేవన్న మాటల్ని ఖండిస్తూ ఆ వ్యక్తే తిరిగి అన్నాడు.

"నేను నిన్ను గుర్తించగలను. అది చాలు. నువ్వు నన్ను గుర్తించనవసరం లేదు."

కొత్త వ్యక్తి ఏక వచన ప్రయోగం రేవన్నికి నచ్చలేదు. గురువుగారి ముందు ఏమీ మాట్లాడ లేకపోయాడు.

"నువ్వెవరో నీ మొహం చూపించకపోయినా, నీ పేరిమిటో చెప్పు.." రేవన్న అడిగాడు.

"సమయం వచ్చినప్పుడు మీ గురువుగారే చెబుతారు. వస్తాను వేదరాయ పండితా!" అంటూ అతను సెలవు తీసుకున్నాడు.

బండి బయల్దేరాక రేవన్న అతని గురించి గురువుని వివరాలడిగాడు.

ఇప్పుడు కాదు, ముద్గల్ వెళ్ళేక చెబుతానని అన్నాడు వేదరాయశర్మ.

రేవన్నకి గురువుగారి పైనా, వ్యక్తి పైనా కోపం వచ్చింది. పైకేమీ అనలేకపోయాడు.

ముద్గల్ వచ్చి గురువుగారింటిముందు బండి దిగుతూ అన్నాడు.

"గురువు గారూ! మనతో బండిలో ప్రయాణించినతనెవరు? ఇప్పుడైనా చెబుతారా?"

రేవన్న ఆతృత గ్రహించాడు వేదరాయశర్మ.

"అతను విజయనగర రాజ్యానికి వేగు. రాయచూరులో సుల్తానుల కదలికల్ని పసిగట్టి విషయం చేరవేస్తాడు. మహారాజుకి ఏదయినా చేరవెయ్యదలచుకుంటే అతను మనకి ముందు చెబుతాడు. మనం రాజుగారికి చెప్పాలి..."

"అలాగా? అతని పేరు?"

"మసూం! హిందువయినా ముసల్మాను పేరుతో వ్యవహరిస్తాడు. ఈ విషయం ఎవ్వరి దగ్గరా ప్రస్తావించద్దు." అంటూ గట్టిగా చెప్పాడు వేదరాయ శర్మ.

గురువు వద్ద శలవు తీసుకొని ఇంటి ముఖం పట్టాడు రేవన్న.

రాజ్య వ్యవహారాల్లో గురువుగారికి కూడా పాత్రుందని మొదటిసారి తెలిసింది రేవన్నకి. రాజ కుటుంబానికి వేదరాయశర్మ ముత్తాతల కాలం నుండీ మంచి సంబంధాలున్నాయని విన్నాడు. గురువు గారికీ, దేవరాయలకీ ఉన్న సాన్నిహిత్యం మొదటిసారి చూసింది విజయనగరంలోనే! అది చూసే ఎంతో ఆశ్చర్యపోయాడు. కేవలం విజయదశమికి ఏదో నృత్యనాటకం ప్రదర్శనకని మొదటనుకున్నాడు. తీరా విజయనగరం వెళ్ళాక వేదరాయశర్మ పలుకుబడి కళ్ళారా చూసాడు. కొత్త విషయాలు ఒక్కొక్కటీ తెలుస్తున్నాయి.

ముందు ముందు గురువుగారే తన జీవితాన్ని పెద్ద మలుపు తిప్పబోతున్నాడన్న సంగతి అప్పుడతనికి తెలీదు.

00000000

.

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library